క్యారీల్లో నలుగుతున్న ప్రాణాలు

- ప్రమాదకరంగా గ్రానైట్ క్వారీలు
- క్వారీల్లో పెద్ద పెద్ద రాళ్లతో తరుచూ ప్రమాదాలు
- శబ్ధ కాలుష్యంతో గిరిజన గ్రామాల ప్రజల అవస్థలు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ


సీతబందల క్వారీ

మాడుగుల రూరల్ : మండలంలో గ్రానైట్ క్వారీలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. గిరిజన శివారు గ్రామాలకు సమీపంలో ఉండడంతో క్వారీల్లో నిత్యం జరుగుతున్న కంపార్సెన్స్ వల్ల శబ్ద కాలుష్యం పెరిగి, గిరిజన ప్రజలు త్రీవ ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గ్రానైట్ పేలుళ్ల వల్ల భారీ శబ్దాలు కూడా క్వారీల పక్కన గల గిరిజన జనావాసాల్లో ఇళ్లు పగులుతున్నాయి. మండలంలో అవురువాడ, పంచాయతీలో సీతబందలలో రెండు క్వారీలు, తుమ్మవానిపాలెం, తిరువాడ, పనుకుగదబూరుతో పాటు చింతలూరు, గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్వారీల నుంచి భారీ లోడ్‌తో రాయిని రవాణా చేసేటప్పుడు రహదారులు శిథిలమవుతున్నాయి. అర్థరాత్రి దాటిన తర్వాత భారీ లోడ్‌తో గ్రానైట్ రాయిని దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. సంబంధిత క్వారీ యజమానుల నిర్లక్ష్యం పూర్తిగా కనిపిస్తుంది. క్వారీల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.


క్వారీలో రవాణాకు సిద్ధంగా వున్న గ్రానైట్ రాయి

అయితే ఆ సమాచారం బయటకు రాకుండా క్వారీ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల అవురువాడ పంచాయతీ శివారు సీతబందల నేషనల్ గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడి కిముడు రాము అనే గిరిజనుడు అక్కడిక్కడే మృతి చెందారు. ఈయన రావికమతం మండలం, బుడ్డిబంద గ్రామానికి చెందిన వాడు. భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. మాడుగుల, రావికమతం మండలాలల్లో గల గ్రానైట్ క్వారీల్లో ఇటువంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. క్వారీ పనుల్లో ఎటువంటి ముందస్తు జాగ్రతలు పాటించడం లేదు. గతంలో కూడా చాలా మంది మృతి చెందారు. ఏ ఒక్కరికీ వరిహారం చెల్లించలేదు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు క్వారీ యజమానుల మీద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. దీనిపై ఇటు రెవెన్యూ, పోలీసు, మైనింగ్, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మైనింగ్ అధికారులు కూడా గ్రానైట్ క్వారీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

క్వారీ ప్రమాదాల్లో యజమానుల నిర్లక్ష్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. బాధితుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి. క్వారీల్లో పేలుళ్ల వల్ల సమీప ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతింటున్నాయి. దీనికి కూడా పరిహారం అందించాలి.

–డి.వెంకన్న,
సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు


కె.జె.పురం1 అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామానికి చెందిన పాలకుర్తి మోహన్‌రావు సహకారంతో ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం గ్రామంలో 2 వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నరసింహనగర్ 2 వార్డు వెల్ఫేర్ అభివృద్ధి కార్యదర్శి గూనిపూడి నాగేశ్వరావు, గ్రామంలో గల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ


గణేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

నర్సీపట్నం : ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పరామర్శించారు. కొద్దిసేపు మాజీ ఎమ్మెల్యే గణేష్‌తో గడిపి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

దేవీ ఆలయం గోపురం పనులకు భూమి పూజ

మాడుగుల : స్థానిక దేవి ఆలయం గోపురం పనులకు సంబంధించి శనివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నున్నా శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆలయ గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదు గౌరవ అధ్యక్షులు ఎస్.వి.కొండలరావు, మోటారు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా చిల్డ్రన్ క్రిస్మస్


మాకవరపాలెంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మాకవరపాలెం : చిల్డ్రన్ క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న పెంతుకొస్తు ప్రార్థనా మందిరంలో శనివారం చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. దీనికి వివిధ గ్రామాల నుంచి పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రిస్మస్ సమీపిస్తుండడంతో గ్రామాల్లో అన్ని చర్చిల ఆధ్వర్యంలో ప్రత్యేక కూటములు ఏర్పాటు చేస్తున్నారు. పాస్టర్లు రత్నం, విక్టర్‌పాల్ పాల్గొన్నారు.


ఇద్దరు డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం


పెంటోజీ


కొండబాబు

మాడుగుల/మాడుగుల రూరల్ : మండలంలో గొటివాడ ఆనకట్టు కుడికాలువ నీటి సంఘానికి సంబంధించి ఇద్దరు డైరక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జంపెన సర్పచ్ నేమాల గురువులు నాయుడు తెలిపారు. వీరనారాయణంలో శనివారం నిర్వహించిన నీటి సంఘ ఎన్నికల్లో స్థానిక రైతు నాయకులు పెచ్చేటి పెంటోజీ, మదుమంతి కొండబాబు ఎంపికయ్యారు. వారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, నాయకులు వెంకటరాజారామ్, రామధర్మజ, బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, కిముడు రమణమ్మ అభినందించారు.

నీటి సంఘాల అధ్యక్షులతో స్పీకర్ సమావేశం


నీటి సంఘం అధ్యక్షులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ఎన్నికైన సభ్యులంతా రిజర్వాయర్లు, చెరువుల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. నీటి సంఘం సభ్యులుగా ఎన్నికైన వారితో సమావేశమయ్యారు. ముఖ్యంగా గేట్ల మరమ్మతులు, లైనింగ్, ఆనకట్టలు పూర్తి చేసేలా ప్రణాళికలు చేయాలన్నారు.

రెండు గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నిక వాయిదా


గొండుపాలెంలో ఎన్నిక వాయిదా వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టీడీపీ మద్దతుదారులు


వి.సంతపాలెంలో నామినేషన్ పత్రాలు తమకు ఇవ్వలేదని తెలుపుతున్న నాగారాయుడి చెరువు రైతులు

కె.కోటపాడు : మండలంలో నీటి సంఘాల ఎన్నికలు పలు గ్రామాల్లో హోరాహోరీగా శనివారం జరిగాయి. నీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం అప్రజాస్వామికంగా జరిపిస్తుండడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు బహిష్కరించారు. దీంతో కె.కోటపాడు, ఎ.కోడూరు, మేడిచర్ల, గొండుపాలెం, గుల్లేపల్లి, ఎ.భీమవరం, వారాడ, వి.సంతపాలెం, చౌడువాడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఈ ఎన్నికల్లో పాల్గోనలేదు.

గొండుపాలెంలో ఎన్నిక వాయిదా

గొండుపాలెం గ్రామంలో గల సీతమ్మ చెరువుకు గల ఆరు టీసీ స్థానాలకు టీడీపీలోనే రెండు వర్గాలకు చెందిన మద్దతుదారులు పోటీలో నిలిచారు. ఆయా స్థానాలకు బండారు గంగన్నపాత్రుడు, బండారు లక్ష్మణరావు, చిటిమిరెడ్డి దండు, బండారు సత్యం, వంటాకు రాము, బండారు అప్పారావు నామినేషన్‌లు చేశారు. వీరికి పోటీగా గ్రామానికి చెందిన సర్పంచ్, ఎంపీటీసీలకు చెందిన టీడీపీ మద్దతుదారులు నామినేషన్ వేశారు. తీరా ఎన్నిక నిర్వహించే సమయానికి రెండు వర్గాల నడుమ ఘర్షణకు పరిస్థితి తలెత్తింది. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశికళ ఎన్నికను వాయిదా వేశారు. తమ వర్గానికి చెంది పోటీలో ఉన్న వారిని ఎన్నుకునేందుకు రైతులు ఎక్కువగా ఉన్న కారణంగా ఎన్నికను కావాలనే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి టీడీపీ నాయకులు వాయిదా వేయించినట్టు పోటీలో ఉన్న బండారు గంగన్నపాత్రుడు, లక్ష్మణరావు, దండు, సత్యం, రాము, అప్పారావు ఆరోపించారు.

వి.సంతపాలెంలో ఎన్నిక వాయిదా

వి.సంతపాలెం గ్రామంలో గల నాగారాయుడి చెరువు పరిధిలో గల ఆరు టీసీ స్థానాలకు శనివారం నిర్వహించిన ఎన్నికను రిటర్నింగ్ అధికారి కె.నాగేంద్రబాబు వాయిదాను వేశారు. పోటీలో పాల్గొనేందుకు ఆయకట్టు రైతులైన వేచలపు సింహద్రప్పడు, జాజిబాబు, రెడ్డి వెంకటరమణ, వేచలపు గంగమ్మ, చిట్టెమ్మ, చిరికి రమణమ్మ తదితరులు వచ్చారు. అదే విదంగా ఎన్నికలో పాల్గొనేందుకు టీడీపీ మద్దతుదారులు కూడా వచ్చారు. పోటీలో పాల్గొనేందుకు నామినేషన్‌లు వేసేందుకు పత్రాలు ఇవ్వాలని కోరినా తమకు రిటర్నింగ్ అధికారి పత్రాలు ఇవ్వలేదని రైతులు లెక్కల దేముడునాయుడు, వేచలపు సింహద్రప్పడు, జాజిబాబు తెలిపారు. దీంతో సాయంత్రం 5 గంటల వరకూ నామినేషన్ పత్రాలు పోటీలో పాల్గొనే రెండు వర్గాల వారికి ఇవ్వలేని కారణంగా ఎన్నికను వాయిదా వేశామని అధికారులు తెలిపినట్టు లెక్కల దేముడునాయుడు తెలిపారు. కె.కోటపాడు, చౌడువాడ, మేడిచర్ల, ఎ.కోడూరు, వారాడ, పొడుగుపాలెం, ఎ.భీమవరం గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికలు అధికార పార్టీ అండదండలతో ప్రశాంతంగా జరిగాయి.

పది సంఘాల కమిటీలు ఏకగ్రీవం


అడ్డసరంలో సిబ్బందికి, నాయకులకు సూచనలు చేసిన తహసీల్దార్ ఎస్.నాగమ్మ

రోలుగుంట : మండలంలో గల పది నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ఏకగ్రీవం చేసుకున్నారు. ఇరిగేష్ ఏఈ సురేష్ సంఘాల వారీగా ఎన్నికైన కమిటీ వివరాలు వెల్లడించారు. గుండుబాడు దొరటేంకు చైర్మన్‌గా మరిశా రాజుబాబు, వైస్ చైర్మన్‌గా మల్లా శ్రీను, బల్జిపాలెం–గుండుబాడు గెడ్డ–చైర్మన్‌గా వారా రాజుబాబు, వైస్ చైర్మన్‌గా గుర్ర సురేంద్ర అడ్డసరం–తివ్వల గెడ్డ చైర్మన్‌గా తంగేటి ఎరుకునాయుడు, వైస్ చైర్మన్‌గా బల్లా లక్ష్మణ, కంచుగుమల– తిమ్మరాజు చెరువు చైర్మన్‌గా యర్రా రాజుబాబు, వైస్ చైర్మన్‌గా కోణ రమణాజీ, కొమరవోలు ఆవ–చైర్మన్‌గా పోతల శ్రీను, వైస్ చైర్మన్‌గా దంట్ల సత్యన్నారాయణ, కొవ్వూరు–కసుమల చెరువు చైర్మన్‌గా యర్రంశెట్టి అప్పలనాయుడు, వైస్ చైర్మన్ యర్రంశెట్టి వాసుదేవమూర్తి , వెదుళ్లవలస–పోతలవాని చెరువు చైర్మన్‌గా మత్సరమణాజి, వైస్ చైర్మన్‌గా చందక నూకరాజు, నిండుగొండ పినపోతులవాని చెరువు కాళ్ల వరహాలనాయుడు, ఇటంశెట్టి బాబూరావు, కుసుర్లపూడి–కై సర్లవాని ,చెరువు సంఘం అనిమిరెడ్డి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా గొల్లుగోవిందరాజు, జానకీరాంపురం అనిమిరెడ్డి వాని చెరువు చైర్మన్‌గా దేవాడ వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా లాలం సూరిబాబు ఏకగ్రీవం అయినట్టు అధికారులు ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా తహసీల్దార్ ఎస్.నాగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు వ్యవహరించారు.

శిరిజాంలో ఎన్నిక ఉద్రిక్తం


కె.జె.పురంలో ఎన్నికల తీరును పరిశీలిస్తున్న జిల్లా ఇరిగేషన్ అధికారి త్రినాథం


ఎం.కోడూరులో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న నాయకులు

మాడుగుల రూరల్ : కోనాం జలాశయం పరిధిలో గల శిరిజాం నీటి సంఘం –2 ఎన్నిక వాయిదా పడింది. ఈ నీటి సంఘానికి దేశం పార్టీ మద్దతుదారులు రెండు వర్గాలుగా విడిపోయి పోటీలో ఉండడంతో ఎన్నికల కేంద్రం వద్ద ఉద్రిక్తత తలెత్తడంతో ఎన్నికలు వాయిదా వేశారు. ఈ సంఘం పరిధిలో 12 డైరెక్టర్లకు ఎన్నిక నిర్వహణకు ఎన్నికలాధికారిగా చోడవరం ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ డిఈఈ బి. లక్ష్మీనారాయణను నియమించారు. వీరితో పాటు పీవోలు, ఏపీవోలను నియమించారు. 12 డైరెక్టర్ల నామినేషన్లు అభ్యర్థుల నుంచి స్వీకరిసున్నారు. 12 వ డైరెక్టరు పదవికి ఆడారి వెంకట్రావు, పెంటకోట పెద కన్నారావు, నామినేషన్ వేశారు. చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించల్సి వుండగా, ఆడారి వెంకట్రావు తన సిగ్మెంటు పరిధిలో వున్న వారిని తీసుకుని ఎన్నిక నిర్వహించాలని కోరారు. రెండో అభ్యర్థి తన మద్దతుదారులను తీసుకో స్తానని చెప్పి బైటకు వచ్చేటప్పుడుకు ఎన్నికలాధికారి ఎన్నికలాధికారి లక్ష్మీనారాయణ ఎన్నిక వాయిదా వేశామని ప్రకటించారు. దీంతో అక్కడే వున్న రెండవ వర్గం నాయకులు ఆళ్ల సంతోష్‌కుమార్, శివకుమార్, కోనాం ప్రాజెక్టు మాజీ ఉపాధ్యక్షురాలు ఆళ్ల అప్పలకొండమ్మ ఎన్నికలాధికారి ఎదుట బైఠాయించారు. ఎన్నికలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణతో మాట్లాడి వాయిదా వేయించారని టీడీపీ నాయకుడు సంతోష్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికలాధికారిపైన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కె.జె.పురంలో ఎన్నికల తీరును జిల్లా ఇరిగేషన్ ఈఈ, ఎన్నికల నోడల్ అధికారి త్రినాథం పరిశీలించారు.

ఎం.కోడూరులో కూటమి నేతల బరితెగింపు

ఎం. కోడూరు గ్రామంలో తారకరామ నీటి సంఘానికి జరిగిన ఎన్నికల్లో స్థానిక హైస్కూల్లో రైతులు నీటి సంఘాల డైరక్టర్లను ఎన్నుకోవడానికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఓడిపోతామనే భయంతో కూటమి నాయకులు పోలీసులపై దౌర్జన్యం చేసారు. నామినేషన్ పత్రాలు చించారు. ఎన్నికలు జరగకుండా కూటమి నాయకులు రైతులను ఇబ్బందులకు గురిచేశారని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు అన్నారు. ఇక్కడ ఒక స్థానం ఏకగ్రీవం కాగా, మరో డైరెక్టర్‌ను ఎన్నుకున్నారు. మరో నాలుగు డైరెక్టర్లు ఎన్నిక వాయిదా వేసినట్టు సంజీవిరావు పేర్కొన్నారు.

ఉత్తమ రైతుకు సన్మానం


ఉత్తమ రైతును సత్కరిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, ఏడీఏ టి.శ్రీదేవి

నర్సీపట్నం : వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం, నూతన వరి వంగడాలను సాగుచేయడంతో ధర్మసాగరంకు చెందిన సుకల అప్పలనాయుడు ఉత్తమ రైతుగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అనకాపల్లిలో నిర్వహించిన కిసాన్ మేళాలో అప్పలనాయుడకు ఉత్తమ రైతు అవార్డు ప్రకటించారు. శనివారం ఏడీఏ టి.శ్రీదేవి ఆయన స్వగ్రామం వెళ్లి జెడ్పీటీసీ రమణమ్మ చేతుల మీదుగా అవార్డు అందజేసి, శాలువాతో సత్కరించారు.

బుచ్చెయ్యపేటలో ప్రశాంతం


వడ్డాదిలో నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గోవిందను అభినందిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : మండలంలో 16 నీటి సంఘాలకు గాను విజయరామరాజుపేట తుమ్మలాడ కాలువకు ఎవరూ నామినేషన్ వేయకపోగా ఎన్నిక వాయిదా పడింది. విజయరామరాజుపేట ఆర్‌ఎస్ కాలువ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తేలలేదు. ఇక్కడ చైర్మన్ పదవి కోసం కూటమి నేతలు పోటీ పడడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిలిచిపోయింది. మేజర్ పంచాయతీ వడ్డాది కస్పా కాలువ చైర్మన్‌గా దొండా పెద గోవింద, రాజాం సింహాద్రి చెరువు చైర్మన్‌గా కంఠంరెడ్డి తాతారావు, రాజాం అమృతవాని చెరువు చైర్మన్‌గా యన్నెంశెట్టి శ్రీను, గున్నెంపూడి పెద్దేరు కాలువ చైర్మన్‌గా సోమిరెడ్డి వెంకటరమణ మూర్తి, పెదపూడి పెద్ద చెరువు చైర్మన్‌గా ఉండా తాతారావు, గంటికొర్లాం భట్లోవ లోవ చెరువు అధ్యక్షులుగా కె.అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

రాజీ మార్గమే ఉత్తమం


లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు పఠాన్ షీయాజ్ ఖాన్, మధుసూదన్‌రావు

నర్సీపట్నం : రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఇరువర్గాలకు మేలు చేకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్‌ఖాన్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం కోర్టు అవరణలో సీనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం , డబ్బు వృథా కాకుండా రాజీపద్ధతిలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఎవరికీ అన్యాయం జరగదన్నారు. అనంతరం కక్షిదారుల సమ్మతితో కేసులను పరిష్కరించారు.

అనుకూలంగా ఉంటే సరే...లేకపోతే వాయిదా!


గుడ్డిప సాగునీటి ఎన్నికల్లో రైతులు

చోడవరం : చోడవరం మండలంలో 21 సాగునీటి సంఘాలకు, రావికమతం మండలంలో 14, బుచ్చెయ్యపేట మండలంలో 16, రోలుగుంట మండలంలో 10 సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి. అధికార టీడీపీ కూటమి తమకు అనుకూలంగా ఈ ఎన్నికలు జరిపించుకునేందుకు కుయుక్తులు చేసిందని ఆరోపిస్తూ ఇప్పటికే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించడంతో చాలా చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. కొన్ని చోట్ల అధికార పార్టీని వ్యతిరేకించే వారు పోటీకి దిగడంతో అధికారులు అక్కడ ఎన్నికను వాయిదా వేశారు. చోడవరం మండలంలో 21 సంఘాల్లో 18 మైనర్, 3 మేజర్ ఉండగా మొత్తం అన్నీ ఏకగ్రీవం అయ్యాయి. అన్ని సంఘాల్లో రైతులు డైరెక్టర్ స్థానాలకు చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఏకగ్రీవంగానే ఆమోదం తెలిపారు. రావికమతం మండలంలో గుడ్డిప సాగునీటి సంఘాల జరిగిన ఎన్నికలో గట్టి పోటీ నెలకొనడంతో వాగ్వావాదం జరిగింది. ఇక్కడ ఎన్నికను వాయిదా వేశారు. మిగతా అన్ని చోట్ల సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది.

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు


బలిఘట్టంలో ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ


సాగునీటి సంఘం ఎన్నికలో పాల్గొన్న రైతులు


పైడిపాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దామోదర్‌నాయుడు

నర్సీపట్నం : అప్రజాస్వామికంగా నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. నర్సీపట్నం మండలంలో రావణాపల్లి రిజర్వాయర్‌తో పాటు మరో ఐదు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఒక్కో సాగునీటి సంఘంలో ఆరు టీసీలు ఉన్నాయి. మొత్తం 36 టీసీలకు ఎన్నికలు నిర్వహించారు. సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. నీటి తీరువా బకాయిలు కట్టించుకోకుండా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన రైతులను ఇబ్బందులకు గురి చేసి, టీడీపీ సానుభూతిపరుల రైతుల బకాయిలను మాత్రమే కట్టించుకున్నారు. అధికారుల తీరుతో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రావణపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి ఆరు టీసీలు చైర్మన్‌గా రుత్తల రాజేష్‌ను ఎన్నుకున్నారు. మిగిలిన ఐదు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బలిఘట్టం సచివాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాగునీటి సంఘ ప్రక్రియను ఆర్డీవో వి.వి.రమణ పరిశీలించారు.

మాకవరపాలెం: మండలంలో పది సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మాకవరపాలెం, పైడిపాల పోలింగ్ కేంద్రాలను నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు పరిశీలించారు.

గొలుగొండ: మండలంలో శనివారం నిర్వహించిన నీటి సంఘం ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించడంతో కూటమి నేతలు పదవులను పంచుకున్నారు. మండలంలో 13 నీటి సంఘం ఎన్నికల్లో ఆయా అధికార పార్టీ నేతలు చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎన్నుకోవడం జరిగింది. చీడిగుమ్మలలో ఎన్నికలను నర్సీపట్నం ఆర్డీవో రమణ పరిశీలించారు.

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం పరిధిలో శనివారం జరిగిన నీటిసంఘాల ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. మండలంలోని మైనర్ ప్రాజెక్టులైన అడ్డులోవగెడ్డ అధ్యక్షునిగా సబ్బవరపు గంగునాయుడు, కాంగెడ్డ అధ్యక్షునిగా దోకల రమణ, జూరెడ్డివాని ట్యాంకు పాత్రిని జగన్నాథరావు అధ్యక్షులుగా, మీడియం ప్రాజెక్టు కోనాం పరిధిలో హైలెవ్‌కాలువ(చీడికాడ)కు పోతల చిన్నంనాయుడు అధ్యక్షుడుగా, లక్ష్మీపురం ఛానల్–1 అధ్యక్షుడిగా కొల్లి పైడింనాయుడు, లక్ష్మీపురం ఛానల్–2 అధ్యక్షునిగా కొట్యాడ చిన్నంనాయుడు, మార్లగుమ్మి ఛానల్ అధ్యక్షునిగా దారపు మండిలు, శిరిజాం ఛానల్ అధ్యక్షునిగా సింగంపల్లి శ్రీరామమూర్తి, సంఘాలకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీటిలో తురువోలు హైలేవుల్ కాలువ అధ్యక్షుడు మినహా మిగిలిన 8 చానళ్ల డైరెక్టర్లు, అధ్యక్షుల ఎన్నిక పూర్తయింది.

తాండవ ప్రాజెక్టు పరిధిలో ఏకగ్రీవం

నాతవరం : జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. జిల్లాలో తాండవ ప్రాజెక్టుకు సంబంధించి పది సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా కూటమి మద్దతుదారులు గెలుపొందారు. ఏడు చిన్నతరహా ప్రాజెక్టు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సైతం ఏకగ్రీవంగా గెలుపొందారన్నారు. మర్రిపాలెం పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా రంభా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బొత్స నాయుడు, వెర్రిగెడ్డ ఆనకట్టు నీటి సంఘం అధ్యక్షుడుగా అల్లు స్వామినాయుడు ఉపాధ్యక్షుడిగా పైల రామారావును, బెన్నవరం రామరాజు చెరువు అధ్యక్షుడిగా నడిగట్ల సత్యంనాయుడు, చమ్మచింత చెరువు అధ్యక్షుడిగా మైనం సత్యనారాయణ వెదురుపల్లి చెరువు అధ్యక్షుడిగా పారుపల్లి సన్యాసిదేముడు, మల్లవరం చెరువు అధ్యక్షుడిగా రొంగలి శ్రీనివాస్, కొత్తూరు చెరువు అధ్యక్షుడిగా గాడి చిన రాంబాబుతో పాటు సంఘాలకు ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాండవ ప్రాజెక్టుకు సంబంధించి నాతవరం సంఘం అధ్యక్షుడిగా పారుపల్లి వరహాలబాబు, ఎం.బి.పట్నం సంఘం అధ్యక్షుడిగా రాయపురెడ్డి వెంకటరమణ మన్యపురట్ల సంఘం అధ్యక్షుడిగా అప్పన దివాణం, గన్నవరం సంఘం అధ్యక్షుడిగా రొంగల వెంకటస్వామి, పీకే గూడెం సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ, వల్సంపేట సంఘం అధ్యక్షుడిగా మిడతాన సత్యవరప్రసాద్, గొలుగొండపేట సంఘం అధ్యక్షుడిగా కరక సత్యనారాయణ, చమ్మచింత సంఘం అధ్యక్షుడిగా పంచాడ సన్యాసియ్య, శృంగవరం సంఘం అధ్యక్షుడిగా, ఉలబాల బాపిరాజు చెర్లోపాలెం సంఘం అధ్యక్షుడిగా లోకవరపు కుల్లయ్యనాయుడుతో పాటు ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు డీఈ అనురాధ తెలిపారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ అభినందించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


ఎ.కోడూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఎ.కోడూరులో శనివారం విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ముత్యాలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలపై రూ.200 కోట్ల భారం ప్రజలపై మోపినట్టు ఆరోపించారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచమంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాట తప్పాడని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం ప్రజలను మోసగించినట్లేనని ఆయన విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ పోతున్నా వాటిని అదుపు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోనకపోతే ఉద్యమం నిర్వహిస్తామని అన్నారు. నిరసనలో యర్రా దేముడు, నాయుడుబాబు పాల్గొన్నారు.

నేడు తాండవ ప్రాజెక్టు నీరు నిలుపుదల

నాతవరం : తాండవ రిజర్వాయరు నుంచి అయకట్టుకు విడుదల చేస్తున్న నీటిని ఆదివారం ఉదయం నుంచి నిలుపుదల చేస్తున్నామని ప్రాజక్టు డీఈ అనురాధ తెలిపారు.ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టు భూములకు ఆగష్టు 19వ తేదీన నీరు విడుదల చేసామన్నారు. వరి పంట పండేయడంతో రైతులు అభీష్టం మేరకు నేటి నుంచి తాండవ ప్రాజెక్టు నుంచి నీరు నిలుపుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో 369.0 అడుగులు నీటి మట్టం ఉందన్నారు. ప్రమాద స్థాయి నీటి మట్టం 380.0 అడుగులు కాగా డేడ్ స్టోరేజీ నీటి మట్టం 344.0 అడుగులు నీటి మట్టంగా పరిగణిస్తామన్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 52వేల ఎకరాలు ఆయకట్టుకు నీటిని పుష్కలంగా సరఫరా చేసామని డీఈ అనురాధ తెలిపారు.

బిళ్లలపాలెంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

200 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : తాటిపర్తి శివారు బిళ్లలపాలెం గ్రామంలో శనివారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ దిలీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. 200 పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ దిలీప్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు గురించి వివరించారు. గ్రూపు సభ్యులు సహకారంతో ప్రతి ఏటా కింగ్‌జార్జిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో బ్రదర్‌రాజు, నాగార్జున, లూకా, శ్రీను, సిస్టర్ లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు.